పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ



సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కునందజేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

ఆల్విన్‌కాలనీ: సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. ఆదివారం నలుగురికి రూ.1.25 లక్షల విలువ గల సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయినేని చంద్రకాంత్‌, కాశీనాథ్‌ యాదవ్‌, సత్యనారాయణ, శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస్‌, మంజుల, రాధాబాయి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌పై బురద చల్లడం మానుకోవాలి



కాంగ్రెస్‌ నాయకురాలు రేష్మ

మోతీనగర్‌: మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి కాంగ్రెస్‌పై బురద చల్లడం సరికాదని, కాంగ్రెస్‌ వల్ల రాజకీయంగా ఎదిగి వెన్నుపోటు పొడిచిన ఘనత ఆమెదేనని కాంగ్రెస్‌ నియోజకవర్గ నాయకురాలు రేష్మ అన్నారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ.. దివంగత, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్‌ రాజశేఖర్‌రెడ్డి నాడు తెలంగాణ ఆడబిడ్డ సబితా ఇంద్రారెడ్డిని హోంమంత్రి చేసి గౌరవిస్తే.. పార్టీ నుంచి గెలిచి బీఆర్‌ఎస్‌లో చేరడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గత ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ పార్టీకి బుద్ధి చెప్పినా వారిలో మార్పు రాలేదని ఎద్దేవా చేశారు.

బీజేపీ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం



మోదీ, మందకృష్ణ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

మోతీనగర్‌: అల్లాపూర్‌ డివిజన్‌ శ్రీ వివేకానందనగర్‌ చౌరస్తాలో పీఎం నరేంద్ర మోదీ, ఎమ్మార్పీఎస్‌ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ చిత్రపటాలకు బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం క్షీరాభిషేకం చేశారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వడం సంతోషకరమని నాయకులు అన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌. వెంకటరామిరెడ్డి, ఉప్పల దామోదర్‌ నేత, గోనెల సుదర్శన్‌, నార్లపురం శ్రీనివాస్‌, దర్శన్‌రావు, నాగరాజుగౌడ్‌, ఆంజనేయులు, అశోక్‌, జి. బాలకృష్ణనాయుడు, మోహన్‌ రాజ్‌, సంజీవ తదితరులు పాల్గొన్నారు.

చెస్‌ టోర్నమెంట్‌



విజేతలతో గ్రాండ్‌ మాస్టర్‌ ప్రత్యూష తదితరులు

ఆల్విన్‌కాలనీ: ప్రత్యూష ఇంటర్నేషనల్‌ చెస్‌ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం హెచ్‌ఎంటీ హిల్స్‌ కమిటీ హాల్‌లో చెస్‌ టోర్నమెంట్‌ను నిర్వహించారు. 7 సంవత్సరాల నుంచి 9, 11 సంవత్సరాలు, ఉత్తమ మహిళా కేటగిరిల్లో పోటీలు జరిగాయి. మొత్తం 80 మంది పాల్గొన్నారు. వీరిలో ప్రతి విభాగంలో మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు, ట్రోఫీ, మెడల్‌ను నిర్వాహకులు అందజేశారు. బహుమతులను ఉమెన్‌ గ్రాండ్‌ మాస్టర్‌ ప్రత్యూష బొడ్డ చేతుల మీదుగా అందజేశారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న సీపీఎం మండల నాయకుడు కృష్ణనాయక్‌

కూకట్‌పల్లి: రాఘవేంద్రనగర్‌ బస్తీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం మండల నాయకుడు కృష్ణనాయక్‌ డిమాండ్‌ చేశారు. ఆదివారం బస్తీలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీలో దోమలు విపరీతంగా ఉన్నాయని, కాలనీకి ఆనుకుని ఉన్న చెరువులో గుర్రపుడెక్కను తొలగించాలన్నారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని, అదే విధంగా శ్మశాన వాటికలో బోరు వేయించాలన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే కాలనీ ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకులు నరసింహ, నాగమణి, మహిళా సంఘం నాయకురాలు పెంచలమ్మ, కృష్ణవేణి, గంగాదేవి పాల్గొన్నారు.

శ్రీ వివేకానందనగర్‌ అధ్యక్షుడిగా శ్రీనివాసరావు గెలుపు



అధ్యక్షుడిగా విజయం సాధించిన బొల్లు శ్రీనివాసరావు తదితరులు

మోతీనగర్‌: అల్లాపూర్‌ డివిజన్‌ శ్రీ వివేకానందనగర్‌ కమ్యూనిటీ హాల్‌లో జరిగిన ఎన్నికల్లో కాలనీ అధ్యక్షుడిగా బొల్లు శ్రీనివాసరావు భారీ మెజార్టీతో గెలుపొందారు. ఆదివారం జరిగిన ఎన్నికల ఫలితాలను ఎన్నికల అధికారి సామ కొండల్‌రెడ్డి వెల్లడించారు. అనంతరం శ్రీనివాసరావు మాట్లాడుతూ.. అందరి సహకారంతో కాలనీని మరింత అభివృద్ధి చేస్తానన్నారు. తన గెలుపునకు కృషి చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తుంగం శ్రీనివాసరావు, రోణంకి జగన్నాథం, చెవ్వూరి మధుసూదనాచారి, బండారి ప్రసన్నాంజనేయులు, రామారావు, శేషవరావు, అంకమరావు, సుదర్శన్‌ పాల్గొన్నారు.

అదనపు బాధ్యతలు.. అటకెక్కిన పర్యవేక్షణ!



13 మండలాలకు ఇన్‌చార్జ్‌ ఎంఈఓలు

- ఒక హెచ్‌ఎంకు ఆరు మండలాలు
- మరో హెచ్‌ఎంకు ఏడు మండలాలు
- మందగిస్తున్న ప్రభుత్వ, ప్రైవేట్‌ పాఠశాలల పర్యవేక్షణ.. విద్యా ప్రగతి పనులు
- మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లా ఏర్పడినప్పటి నుంచి ఇలానే...
- పట్టించుకోని విద్యాశాఖ.. ఇబ్బందుల్లో పాఠశాల ప్రగతి
- జిల్లాలో 1500 ప్రైవేట్‌, 507 ప్రభుత్వ పాఠశాలలు

సాక్షి, సిటీబ్యూరో: మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల పర్యవేక్షణ, విద్యా ప్రగతిని సమీక్షించే మండల విద్యాశాఖ అధికారులు బాధ్యతలు నిర్వహిస్తున్న వారే ఉండటంతో నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. జిల్లాలో మొత్తంగా 15 మండలాలు ఉండగా, ఉప్పల్‌, బాలానగర్‌ మండలాలు మినహాయించి, మిగతా 13 మండలాలకు ఇద్దరు గెజిటెడ్‌ ప్రధానోపాధ్యాయులు ఇన్‌చార్జ్‌ ఎంఈఓలుగా ఆరు నుంచి ఏడేసి మండలాల బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. రెండు మండలాలకు నియమితులైన ఇద్దరు ఎంఈఓలు కూడా సాధారణ బదిలీల్లో భాగంగా ఇటీవల బాధ్యతల్లో చేరారు. మరో వైపు హెచ్‌ఎంలు ఇన్‌చార్జ్‌ ఎంఈఓలుగా తాను పని చేస్తున్న పాఠశాలతోపాటు ఆరుకు పైగా మండలాల్లో విద్యాశాఖ బాధ్యతలను నిర్వహించటం తలకు మించిన భారంగా మారుతోంది.

- మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలో 13 మండలాలకు ఇద్దరు ఇన్‌చార్జ్‌ ఎంఈవోలు విధులు నిర్వర్తిస్తున్నారు. ఒక్కో ఇన్‌చార్జ్‌ ఎంఈఓ ఆరు నుంచి ఏడు మండలాల బాధ్యతలను నిర్వహిస్తుండటంతో వారికి తలకు మించిన భారంగా మారుతోంది. దీనికి సొంత పాఠశాల బాధ్యతలను కూడా చూసుకోవాల్సి రావటం కష్టతరంగా మారుతోంది.
- కీసర పాఠశాల ప్రధానోపాధ్యాయులు శశిధర్‌ ఇన్‌చార్జ్‌ ఎంఈఓగా ఆరు మండలాలు కీసర, ఘట్‌కేసర్‌, కాప్రా, మేడిపల్లి, మల్కాజిగిరి, అల్వాల్‌ బాధ్యతలు చూస్తున్నారు.
- తూముకుంట ప్రధానోపాధ్యాయురాలు వసంతకుమారి ఏడు మండలాలైన మేడ్చల్‌, శామీర్‌పేట, మూడుచింతలపల్లి, కుత్బుల్లాపూర్‌, బాచుపల్లి, దుండిగల్‌, కూకట్‌పల్లి బాధ్యతలను నిర్వహిస్తున్నారు.
- దీంతో విద్యా ప్రగతి కుంటుపడుతుందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే మండలానికి ఒక ఎంఈఓ నియామకంపై విద్యాశాఖ చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పేరుకుపోయిన సమస్యలివీ...

మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలో 1500 ప్రైవేటు పాఠశాలలు, 507 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ప్రైవేట్‌ పాఠశాలల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. డొనేషన్లు, అధిక ఫీజులు వసూళ్లతోపాటు బడిలోనే పాఠ్య, నోట్‌ పుస్తకాలు, స్కూల్‌ దుస్తుల విక్రయాలు ఇష్టమొచ్చిన ధరలతో విక్రయిస్తున్నారు. ఈ విషయంలో విద్యాశాఖ నియంత్రణ లేకుండా పోతోంది. అలాగే విద్యాశాఖ అనుమతి లేకుండా పదుల సంఖ్యలో ప్రైవేట్‌ పాఠశాలలు నడుస్తున్నా పట్టించుకోని పరిస్థితి నెలకొంటోంది. ఇరుకైన గదులు, బహుళ అంతస్తు భవనాల్లో ఎలాంటి భద్రత చర్యలు లేకుండా కొనసాగుతున్న ప్రైవేట్‌ పాఠశాలలను విద్యాశాఖ నియంత్రించ లేకపోతోంది. ఆట స్థలాలతో పాటు ఏదైనా ప్రమాదం జరిగినా... అగ్ని ప్రమాదాలు సంభవించినా.. నివారణ చర్యలు తీసుకోవటానికి వీలులేకుండా ఉన్న భవనాల్లో ప్రైవేట్‌ పాఠశాలలు కొనసాగుతున్నా పట్టించుకునే నాథులే కరవయ్యారు.

- ప్రభుత్వ పాఠశాలల్లో చాలా చోట్ల ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదు. బయోమెట్రిక్‌ లేకపోవడంతో ఆలస్యంగా విధులకు హాజరవుతున్నారనే ఆరోపణలున్నాయి. ఇన్‌చార్జ్‌ ఎంఈవోలు పాఠశాల సముదాయ సమావేశాలు, మండల, జిల్లా సమీక్ష సమావేశాలకు వెళ్లాల్సి ఉండటంతో తనిఖీలు నామమాత్రంగా నిర్వహిస్తున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై ఒకటిన్నర నెల దాటినా ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు అందని పరిస్థితి నెలకొంది.
- మధ్యాహ్న భోజన పథకంపై పర్యవేక్షణ లేక నాణ్యత లోపిస్తోంది. మన బడి–మన పల్లె–మన బస్తీ, అమ్మ ఆదర్శ కమిటీల అధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చేపడుతున్న ప్రగతి పనుల పురోగతి ఆందోళన కలిగిస్తోంది. తొలిమెట్టు, ఉన్నతి వంటి కార్యక్రమాల అమలుపై నిర్లక్ష్యం కనిపిస్తోంది. విద్యార్థుల్లో నానాటికీ సామర్థ్యాలు పడిపోతున్నాయి. విద్యాప్రగతి లేని చోట ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం లేదు.



ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం



జిల్లాలోని 13 మండలాల్లో గెజిటెడ్‌ ప్రధానోపాధ్యాయులు ఇన్‌చార్జ్‌ ఎంఈవోలుగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ విషయమై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. పాఠశాలలపై పర్యవేక్షణలో ఎలాంటి ఇబ్బంది లేదు. ఎంఈవోలు తమ పరిధిలోని పాఠశాలల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు. విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నాం.

– ఐ.విజయకుమారి, డీఈవో, మేడ్చల్‌–మల్కాజిగిరి

ఉచిత కంటి వైద్య శిబిరం



శిబిరంలో పాల్గొన్న ఇన్‌స్పెక్టర్‌ ముత్తు, వైద్యులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం మాక్స్‌ విజన్‌ గ్రూప్‌ ఆఫ్‌ హాస్పిటల్స్‌ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి ఇన్‌స్పెక్టర్‌ ముత్తు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సేవా దృక్పథంతో ఇలాంటి శిబిరాలను మరిన్ని నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో గువ్వల శ్రీనివాసరెడ్డి, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

రాజకీయం కాదు.. బాధితులకు సాయం చేయండి

కార్పొరేటర్‌ ఆవుల రవీందర్‌రెడ్డి

బాలానగర్‌: కుక్క కాటు బాధితులను పరామర్శించకుండా, పరామర్శించిన వారిని బెదిరించడం కాంగ్రెస్‌ నాయకులకు తగదని కార్పొరేటర్‌ ఆవుల రవీందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. రాజకీయాలు చేయటం కాదని, సహాయం అందించాలని సూచించారు. బాధితులకు అండగా నిలిచిన సామాజిక కార్యకర్తలను బెదిరించడం ఎంత వరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం



ఆల్విన్‌కాలనీ: రామకృష్ణ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కేక్‌ కట్‌ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో జనంపల్లి పురంధర్‌రెడ్డి, రామచంద్రరావు, శ్రీధర్‌, నర్సింగ్‌రావు, వెంకటేశ్వరరావు, సూర్యనారాయణ, రవికిరణ్‌, శ్రీనివాసరావు, శ్రీనివాసరెడ్డి, లక్ష్మణరావు పాల్గొన్నారు.

గొడవపడి వృద్ధురాలి అదృశ్యం



బాలానగర్‌: కుటుంబ సభ్యులతో గొడవ పడి ఓ వృద్ధురాలు ఇల్లు వదిలి వెళ్లిన సంఘటన బాలానగర్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. శోభన కాలనీలో శివకుమార్‌ తన కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నారు. శివకుమార్‌ తల్లి శాంతి (57) శనివారం ఇంట్లో కుటుంబ సభ్యులతో గొడవపడి తన ఆధార్‌కార్డు తీసుకొని ఇల్లు విడిచి వెళ్లిపోయింది. ఎంత వెతికినా ఆచూకీ తెలియలేదు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె తెలుగు, హిందీ, తమిళం భాషలు మాట్లాడుతుందని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నవీన్‌కుమార్‌ తెలిపారు.

స్వార్థం కోసమే కాంగ్రెస్‌లోకి..



సమావేశంలో మాట్లాడుతున్న విజిత్‌వర్మ

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ తన స్వార్థం కోసమే బీఆర్‌ఎస్‌ నుంచి కాంగ్రెస్‌లో చేరారని , నియోజకవర్గ అభివృద్ధి కోసం కాదని బీజేపీ మీడియా రాష్ట్ర కో ఆర్డినేటర్‌ విజిత్‌వర్మ అన్నారు. రిజల్ట్స్‌ స్థాయి కార్యకర్తల సమావేశం డివిజన్‌ అధ్యక్షులు అనిరెడ్డి భూపాల్‌రెడ్డి అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంపాదించిన ఆస్తుల రక్షణ కోసం పార్టీ మారడం సరికాదన్నారు. నాడు బీఆర్‌ఎస్‌లో, నేడు కాంగ్రెస్‌లో చేరి నియోజకవర్గ ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదని ఎద్దేవా చేశారు. సమావేశంలో అసెంబ్లీ కో కన్వీనర్‌ మణిభూషణ్‌, డివిజన్‌ ప్రధాన కార్యదర్శులు గంగుల రాజిరెడ్డి, ఆసం శ్రీకాంత్‌ యాదవ్‌, జిల్లా నాయకులు అంతం బాలు యాదవ్‌, మహిళా మోర్చా అధ్యక్షురాలు కమటం శ్రీలత, ప్రధాన కార్యదర్శి సంధ్య, ఓబీసీ మోర్చా అధ్యక్షులు కృష్ణ, రమేష్‌ యాదవ్‌, కిరణ్‌, దీపక్‌, విజయ్‌, పవన్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో రుద్ర చండీ హోమం

కూకట్‌పల్లి: బాలానగర్‌ డివిజన్‌ పరిధిలోని కట్ట మైసమ్మ ఆలయంలో ఆషాఢమాసం చివరి ఆదివారం సందర్భంగా రుద్ర చండీహోమాన్ని నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు హారతి ఇచ్చి ఆశీర్వదించారు. ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో దాసరి శంకరరెడ్డి, సురేందర్‌ రెడ్డి, కాలనీ వాసులు పాల్గొన్నారు.



కనకదుర్గ అమ్మవారికి పూజలు

మూసాపేట: బాలాజీనగర్‌ డివిజన్‌ పరిధిలోని ఆంజనేయనగర్‌ కాలనీలో ఆదివారం బీఆర్‌ఎస్‌ డివిజన్‌ అధ్యక్షులు ప్రభాకర్‌గౌడ్‌ ఆధ్వర్యంలో కనకదుర్గ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్‌ బాబురావు, ఆంజనేయ నగర్‌ కాలనీ అధ్యక్షులు యోగేందర్‌ సింగ్‌, వేంకటేశ్వర స్వామి ఆలయ అధ్యక్షులు పాండుగౌడ్‌, మూసాపేట అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్‌, కాలనీ ప్రధాన కార్యదర్శి కృష్ణంరాజు పాల్గొన్నారు.

ఇంజినీర్ల మధ్య ఘర్షణ!

రాయదుర్గం: జీహెచ్‌ఎంసీకి చెందిన ఇద్దరు ఇంజినీర్లు ఘర్షణపడ్డారు. అందుకు గల కారణాలపై ఆరా తీస్తున్న పోలీసులు విచారణ అనంతరం కేసుల నమోదుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. వివరాల్లోకి వెళితే.. జీహెచ్‌ఎంసీ వెస్ట్‌జోన్‌ శేరిలింగంపల్లి సూపరింటెండెంట్‌ ఇంజినీర్‌ శంకర్‌, శేరిలింగంపల్లి సర్కిల్‌ ఏఈ రమేష్‌ల మధ్య మూడు రోజుల క్రితం మాటా మాటా పెరిగి ఒకరిపై ఒకరు చేయిచేసుకున్నారని తెలిసింది. ఎస్‌ఈ ఇంజనీర్లతో సీఎస్‌ఆర్‌ పనులపై చర్చిస్తుండగా..ఒక వర్క్‌ విషయంలో ఏఈ రమేష్‌ మాట్లాడడంతో ఆయనను ఎస్‌ఈ వారించినట్లు, తిట్ల వర్షం కురిపించినట్లు తెలిసింది. తిరిగి ఎస్‌ఈ దగ్గరకు ఏఈ వెళ్లి తనను దూషించడం, కొట్టడమేంటని ప్రశ్నించగా మళ్లీ ఇద్దరి మధ్య ఘర్షణ చోటు చేసుకున్నట్లు తెలిసింది. అనంతరం ఈ విషయాన్ని సర్కిల్‌లోని అధికారుల దృష్టికి తెచ్చినా స్పందించకపోవడంతో ఏఈ రమేష్‌ గచ్చిబౌలి పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ విషయం తెలిసి ఎస్‌ఈ శంకర్‌ కూడా ఫిర్యాదు చేయడంతో పోలీసులు విచారణ ప్రారంభించారు. ఈ విషయంపై ఇన్‌స్పెక్టర్‌ ఆంజనేయులు మాట్లాడుతూ ఈ కేసు విచారణ చేసిన తర్వాత కేసులు నమోదు చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఇద్దరు వేర్వేరుగా ఫిర్యాదులు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఇలా అధికారుల మధ్య ఘర్షణ చోటు చేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. ఈ విషయమై మాట్లాడడానికి వారు నిరాకరిస్తున్నారు. దీంతో పోలీసులు విచారణ చేసి కేసు నమోదు చేస్తేనే వివరాలు బయటపడే అవకాశం ఉంది.

లారీ డ్రైవర్‌ అజాగ్రత్త



జీడిమెట్ల: లారీ డ్రైవర్‌ అజాగ్రత్తగా రివర్స్‌ తీస్తూ వెనుక వస్తున్న కారును ఢీకొట్టడంతో కారులోని నలుగురు గాయపడ్డారు. ఈ ఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్‌ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్‌ మల్లేశ్‌ తెలపిన వివరాల ప్రకారం.. సాయిబాబానగర్‌కు చెందిన నవీన్‌, భాను, ప్రసాద్‌, మోహన్‌ ఆదివారం ఉదయం స్విఫ్ట్‌ కారులో సుభాష్‌నగర్‌ నుంచి సాయిబాబానగర్‌ వైపు వెళ్తున్నారు. గతి ట్రాన్స్‌పోర్ట్‌ వద్దకు చేరుకోగానే ట్రాన్స్‌పోర్ట్‌కు చెందిన లారీ కంటైనర్‌ డ్రైవర్‌ అజాగ్రత్తగా రివర్స్‌ తీస్తూ కారును ఢీకొట్టడంతో అందులోని నలుగురు గాయపడ్డారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బోనాలు సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ



బోనాల వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ తదితరులు

ఆల్విన్‌కాలనీ: సంస్కృతి, సంప్రదాయాలకు బోనాలు ప్రతీక అని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. కూకట్‌పల్లి డివిజన్‌, దీనబంధు కాలనీలో మైసమ్మ, పోచమ్మ బోనాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గాంధీ హాజరై అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమ్మవారి దీవెనలతో ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ నాయకులు ప్రసాద్‌, ఎండీ ఇబ్రహీం, ఎల్లం నాయుడు, గిరి మోహన్‌రావు, శెట్టి మహేందర్‌ నాయక్‌, వెంకటేష్‌, సుధాకర్‌, ఆంజనేయులు, డేవిడ్‌, రామారావు, అశోక్‌, ఎస్పీ మహేష్‌, బాలు, నాగన్న, ఆవుల రాజు, శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కూకట్‌పల్లి, దీనబంధు కాలనీలోని రేణుకా ఎల్లమ్మ ఆలయ బోనాల్లో కాంగ్రెస్‌ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్‌, సీనియర్‌ నాయకుడు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వడ్డెర సంఘం ఆధ్వర్యంలో..

మూసాపేట: మూసాపేటలోని బండ మైసమ్మ అమ్మవారి ఆలయం వద్ద వడ్డెర సంఘం ఆధ్వర్యంలో బోనాలను ఘనంగా నిర్వహించారు. మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించారు. ముఖ్య అతిథిగా కాంగ్రెస్‌ కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్‌, మాజీ కార్పొరేటర్‌ పగడాల బాబూరావు, తూము శ్రావణ్‌కుమార్‌ హాజరయ్యారు. కార్యక్రమంలో అంబటి శ్రీనివాస్‌, జిల్లా గోపాల్‌, బ్యాంక్‌ మల్లేష్‌, తుకారాం, విష్ణు, వడ్డెర సంఘం నాయకులు బందప్ప, నరసింహ, సాయిలు, సత్యయ్య, రాజు, నర్సింగ్‌ పాల్గొన్నారు.



రేణుకా ఎల్లమ్మ బోనాల వేడుకల్లో పాల్గొన్న జగదీశ్వర్‌ గౌడ్‌, వెంకటేశ్వరరావు తదితరులు



బోనాల వేడుకల్లో పాల్గొన్న భక్తులు

అమ్మ పేరిట ఓ మొక్క



హెచ్‌సీయూలో మొక్కలు నాటేందుకు సిద్ధమైన ఎన్‌ఎస్‌ఎస్‌ వలంటీర్లు

- హెచ్‌సీయూలో ఎన్‌ఎస్‌ఎస్‌ ఆధ్వర్యంలో నిర్వహణ
- మొక్కలు నాటిన అధికారులు, సిబ్బంది, వలంటీర్లు
- ఏడాది పొడవునా ప్రతి శనివారం, ముఖ్య రోజుల్లో చేపట్టాలని నిర్ణయం

రాయదుర్గం: ఇటీవల దేశ ప్రధాని నరేంద్రమోదీ 'మన్‌ కీ బాత్‌' కార్యక్రమంలో భాగంగా పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతిఒక్కరూ తమ 'అమ్మ' పేరిట మొక్కను నాటాలని పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. దీంతో గచ్చిబౌలి హైదరాబాద్‌ సెంట్రల్‌ యూనివర్శిటీలోని 'నేషనల్‌ సర్వీస్‌ స్కీమ్‌' (ఎన్‌ఎస్‌ఎస్‌) సెల్‌ ఆధ్వర్యంలో క్యాంపస్‌లో 'ఏక్‌ పేడ్‌ మా కే నామ్‌' పేరిట మొక్కలు నాటే కార్యక్రమానికి శనివారం శ్రీకారం చుట్టారు. ఎన్‌ఎస్‌ఎస్‌ సెల్‌, హార్టికల్చర్‌, శానిటేషన్‌ విభాగాల సహకారంతో నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్‌ సెల్‌ కోఆర్డినేటర్‌ డాక్టర్‌ కృష్ణయ్య పర్యవేక్షణలో క్యాంపస్‌లో 'క్లీన్‌ అండ్‌ గ్రీన్‌' కార్యక్రమాన్ని నిర్వహిస్తుంటారు. ఏడాది పొడవునా 'ఏక్‌ పేడ్‌ మా కే నామ్‌'

- హెచ్‌సీయూ క్యాంపస్‌లో యేటా పర్యావరణ దినోత్సవం రోజుతో పాటు వర్షాకాలంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఎన్‌ఎస్‌ఎస్‌ సెల్‌ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.
- ఇప్పటినుంచి ఎన్‌ఎస్‌ఎస్‌ సెల్‌ ఆధ్వర్యంలో ఏడాది పొడవునా 'ఏక్‌ పేడ్‌ మా కే నామ్‌' కార్యక్రమాన్ని చేపట్టాలని నిర్ణయించారు.
- ఇందులో ఎన్‌ఎస్‌ఎస్‌ వలంటీర్లు, హార్టికల్చర్‌, శానిటేషన్‌ విభాగాలే కాకుండా హెచ్‌సీయూ వైస్‌ చాన్స్‌లర్‌, వైస్‌చాన్స్‌లర్లు, రిజిస్ట్రార్‌, ప్రొఫెసర్లు, ఫ్యాకల్టీ, అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు, సిబ్బంది అందరినీ భాగస్వాములు చేయనున్నారు.
- ఏడాది పొడవునా ప్రతి శనివారం, ఇతర ముఖ్యమైన రోజుల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టనున్నారు.
- ముఖ్యంగా క్యాంపస్‌లో పండ్లు, పూల మొక్కలే ఎక్కువగా నాటాలే ఏర్పాట్లు చేస్తున్నారు.
- మొదటిసారిగా శనివారం 450 మొక్కలు నాటారు. ఇందులో మామిడి, దానిమ్మ, మందార, క్లోరోఫైటం, తాటి, గుడిచెట్టు వంటివి అధికంగా ఉన్నాయి. భవిష్యత్‌లో అన్ని పూలు, పండ్ల మొక్కలే నాటాలని నిర్ణయించారు.